

సిటీబ్యూరో. ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : జపాన్‌కు చెందిన జేఆర్ క్యూషు కంపెనీ, సింగపూర్‌కు చెందిన ఐసీ ఎంజీ గ్రూపు ప్రతినిధుల బృందాలు టీ హబ్‌ను సందర్శించారు. టెక్నాలజీ స్టార్టప్‌లతో దేశ, విదేశాల్లోనూ కార్యకలాపాలను నిర్వహిస్తున్న టీ హబ్‌తో కలిసి పని చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో జపాన్, సింగపూర్‌కు చెందిన కంపెనీ ప్రతినిధుల బృందాలు టీ హబ్‌లో జరుగుతున్న స్టార్టప్ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించినట్లు టీ హబ్ ప్రతినిధి తెలిపారు. గ్లోబల్ ఇన్నోవేషన్ కార్యకలాపాలను ప్రోత్సహించడానికి, అంతర్జాతీయ స్థాయిలో భాగస్వాములను పెంచుకోవడానికి టీ హబ్ ప్రయత్నాలు చేస్తున్నదన్నారు.


నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, మంగళవారం 6 ఆగస్టు 2024 VIKARABAD


## రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలి

సిటీబ్యూరో, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ ): ఆక్రమణలకు గురైన చెరువు ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్రై సిటీ పరిధిలోని చెరువులను ఆక్రమించడంతో పాటు అక్రమంగా జరిగిన నిర్మాణాలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని, రిపోర్టు ఆధారంగా అక్రమార్కులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.



# ఆరా తీసి..అభయమిచ్చి

- షాద్‌నగర్‌లో పోలీసుల థర్డ్ డిగ్రీ బాధితురాలికి అండగా నిలిచిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు
- పోలీసుల వైఖరిపై ధ్వజమెత్తిన మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్
- అసెంబ్లీలో సీఎం మహిళలను అవమానపరుస్తుంటే.. పోలీసులూ అదే వైఖరి అవలంబిస్తున్నారని ధ్వజమెత్తిన బీఆర్ఎస్ రాష్ట్రనేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కాంగ్రెస్‌హయాంలో శాంతిభద్రతలు కరువయ్యాయన్న మాజీ ఎంపీ మంద జగన్నాథం, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్, ఆగస్టు 5 : ఇబ్బడిముబ్బడిగా నేరాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అందుకే పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల థర్డ్ డిగ్రీతో అనారోగ్యంపాలై షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న దళిత మహిళ సునీతను ఆమె సోమవారం పరామర్శించారు. జరిగిన ఉదంతంపై ఆరా తీసి అండగా ఉంటామని అభయమిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండేదని, నేడు పరిస్థితి తారుమారైందన్నారు. మహిళ అని కూడా చూడకుండా, పోలీసులు విచక్షణా రహితంగా కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం అసెంబ్లీలో మహిళా సభ్యులను అవమానిస్తుంటే.. పోలీసులు కూడా అదే వైఖరి అవలంబిస్తూ మహిళను విచక్షణారహితంగా కొట్టారన్నారు. సీఎం సోదరుల కాన్వాయ్‌కు రక్షణ కల్పించే పనిలో ఉన్న పోలీసులకు సామాన్యులు కనిపించడం ఎద్దేవా చేశారు. థర్డ్ డిగ్రీ సంఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో రౌడీ షీటర్లదే రాజ్యం నడుస్తున్నదని, థర్డ్ డిగ్రీకి కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాన్యులకు రక్షణ కరువైందని, శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని మాజీ ఎంపీ మంద జగన్నాథం, మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వారు బాధితురాలికి లక్ష రూపాయల ఆర్థికసాయాన్ని అందజేశారు.



షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో థర్డ్ డిగ్రీ బాధితురాలిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీ మంద జగన్నాథం, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తదితరులు

# స్వచ్ఛధనమేది?

**8 నెలలుగా గ్రామ పంచాయతీలకు అందని నిధులు**

- ఆర్థిక భారంతో కృంగిపోతున్న పంచాయతీ కార్యదర్శులు
- క్లోరినేషన్, బ్లీచింగ్ పౌడర్ కూడా కరువే..
- జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన స్వచ్ఛదనం-పచ్చదనం
- మొదటి రోజు ర్యాలీలు నిర్వహించిన ఉపాధ్యాయులు, అధికారులు

వికారాబాద్/బొంరాస్‌పేట, ఆగస్టు 5 : గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. ఈ నెల 9వ తేదీ వరకు ఐదు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి రోజూ ఒక కార్యక్రమాన్ని చేపట్టేలా పంచాయతీరాజ్ శాఖ అధికారులు షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయలేదు. దీంతో ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులు తర్జనభర్జన పడుతున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏడాదికి ఒకసారి పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టేది. అదే విధంగా ప్రతి మూడు నెలలకోసారి పంచాయతీలకు నిధులను క్రమం తప్పకుండా విడుదల చేసేది. ఈ నిధులతో గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, నీటి వనరుల క్లోరినేషన్, మొక్కల పెంపకం, కలుపు మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయడం, మురికి గుంతలను పూడ్చడం వంటి పనులు చేపట్టేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నయా పైసా పంచాయతీలకు ఇవ్వకుండా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో చెత్తను తరలించే ట్రాక్టర్లకు డీజిల్ పోయించి, వీధి దీపాల ఏర్పాటు కోసం సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంతో ఖర్చుల భారం తమపైనే పడుతున్నదని కార్యదర్శులు భావిస్తున్నారు. క్లోరినేషన్ పనులు చేయడానికి బ్లీచింగ్ పౌడర్‌నూ ప్రభుత్వం సరఫరా చేయడంలేదు. దీంతో కార్యదర్శులు సొంత డబ్బులు వెచ్చించి బ్లీచింగ్ పౌడర్‌ను కొనుగోలు చేశారు. ఫిబ్రవరి నెల నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు లేక అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆటంకాలు ఎదురవుతున్నాయి.

### ఖర్చులు పెరిగాయి..

గ్రామాల్లో నిత్యం చేసే కార్యక్రమాలకు నిధులు కావాల్సిందే. పారిశుధ్య ట్రాక్టర్‌కు డీజిల్ తప్పనిసరి. పైప్‌లైన్ మరమ్మతులు, బోరు మోటర్ల మరమ్మతులు, వీధి దీపాలు, బ్లీచింగ్ పౌడర్, విద్యుత్ బిల్లులు, గుంతలు పూడ్చేందుకు జేసీబీలు తదితర ఖర్చులు పెరిగాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి దాదాపు 8 నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల కాలేదు. గ్రామంలో ఏ పనులు చేయాలన్నా పంచాయతీ కార్యదర్శులే కీలకం. పంచాయతీ కార్యదర్శులే వీటిని భరించుకొని ఆర్థికంగా కృంగిపోతున్నారు. ఇది చాలదన్నట్లుగా ప్రభుత్వం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామ సభలు, విద్యార్థులతో ర్యాలీలు, బహుమతులు, ఫ్లెక్సీలు, బ్లీచింగ్ పౌడర్, గేట్‌వాల్స్, పైప్‌లైన్లు, గుంతలు పూడ్చడం, డీజిల్, గడ్డి మందు, తాగునీరు తదితర వాటికి అదనంగా ఖర్చులు పెరిగాయని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇచ్చే పరిస్థితిలో లేకపోవడంతో ఈ ప్రభావం పూర్తిగా పంచాయతీ కార్యదర్శులపై పడింది. గతంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శుల బాధలు వర్ణనాతీతం. ఈ ఆర్థిక భారాన్ని తట్టుకోలేక పోతున్నామంటూ కొందరు కంటతడి పెట్టారు. విసిగిపోయిన కొందరు కార్యదర్శులు గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేస్తే తప్ప పనులు చేయలేమని ఎంపీడీవోల దృష్టికి తీసుకొచ్చిన సందర్భాలూ ఉన్నాయి. ఇటీవల వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్‌తో కూడా పంచాయతీ కార్యదర్శులు మొర పెట్టుకున్నారు. త్వరలో తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొంటున్నారు.



బొంరాస్‌పేటలో 'స్వచ్ఛదనం-పచ్చదనం'పై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

### స్వచ్ఛదనం-పచ్చదనం షురూ..

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం సోమవారం షురూ అయ్యింది. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 566 గ్రామ పంచాయతీలు, నాలుగు పురపాలక సంఘాల్లో పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పల్లెల్లో ర్యాలీలు నిర్వహించారు. మంగళవారం రెండో రోజు తాగునీరు, వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కల్పించడం, బుధవారం నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి పూడ్చివేయించడం, గురువారం కుక్కల బెడద నివారణతో పాటు ప్రజారోగ్యంపై దృష్టి, శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాలను శుభ్రం చేయడం, మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడుతారు. వీటితోపాటు పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ అంశాలపై ఉపన్యాసం, వ్యాస రచన పోటీలను నిర్వహిస్తారు.



తాండూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సభాపతి ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

# జిల్లా అభివృద్ధికి కృషి

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- రెవెన్యూలో ప్రక్షాళన.. త్వరలో కొత్త చట్టం
- రోడ్లు, సబ్ స్టేషన్లకు ప్రత్యేక నిధులు
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఎడ్యుకేషన్ హబ్‌గా తాండూరు : ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఆగస్టు 5 : వికారాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. తాండూరు నియోజకవర్గంలో సోమవారం రూ. 250 కోట్ల అభివృద్ధి పనులకు శాసనసభాపతి ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. తాండూరు మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 నీటి పథకం నుంచి నీటి సరఫరా అభివృద్ధికి రూ.27.50 కోట్లు, గొల్ల చెరువు సుందరీకరణ మురుగు నీటి తొలగింపు కాల్వ నిర్మాణానికి రూ.4.88 కోట్లు, సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్‌కు రూ.1.60 కోట్లు, తాండూరు-వికారాబాద్ రోడ్డు నిర్మాణానికి రూ.48.80 కోట్లు, తాండూరు-మహబూబ్‌నగర్ రోడ్డు నిర్మాణానికి రూ.35 కోట్లు, చంద్రవంచ సబ్‌స్టేషన్‌కు రూ.2.34 కోట్లు, కందనెల్లి సబ్‌స్టేషన్‌కు రూ.2.43 కోట్లు, జుంటుపల్లి సబ్‌స్టేషన్‌కు రూ.2.99 కోట్ల పనులకు శంకుస్థాపనలతో పాటు రూ.2.48 కోట్లతో ఏర్పాటు చేసిన జినుగుర్తి సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. రూ.30 కోట్లతో బషీరాబాద్-కరన్‌కోట్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ వికారాబాద్ నియోజకవర్గంతో పాటు తాండూరు అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామన్నారు. అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. వెనుకబడిన తాండూరు అభివృద్ధి కోసం సీఎంతో మాట్లాడి ప్రత్యేక నిధులు ఇప్పిస్తానన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ప్రక్షాళన చేపట్టామన్నారు. ప్రస్తుత చట్టాన్ని సవరణ చేస్తూ త్వరలో నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకొస్తామన్నారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికీ విడుతల వారీగా 3500 ఇండ్ల చొప్పున మంజూరు చేస్తున్నామని, అర్హులందరికీ ఇండ్లు ఇస్తామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన రహదారులతో పాటు ప్రతి పల్లెకూ రోడ్లు వేస్తామన్నారు. కరెంటు ఇబ్బందులు లేకుండా తాండూరులో అవసరమున్నంతవరకు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తామని, ఇందుకు నిధులు విడుదల చేస్తామన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం, మంత్రులతో మాట్లాడి తాండూరుకు ప్రత్యేక నిధులు తీసుకొస్తామని, కంది బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా తాండూరును ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, ఇంజినీర్ ఇన్ చీఫ్ మోహన్‌నాయక్, ఎస్‌ఈ వసంతనాయక్, ఇన్‌చార్జి ఈఈ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మార్కెట్ కమిటీ పదవీ ప్రమాణ స్వీకారోత్సవం..

తాండూరు, బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీల నూతన కార్యవర్గ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, వైస్ చైర్మన్ చందర్‌నాయక్‌తో పాటు పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నూతన పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 5 : పరిసరాల పరిశుభ్రత పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మున్సిపల్ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం విద్యార్థులతో కలిసి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం 'స్వచ్ఛదనం-పచ్చదనం'పై విద్యార్థులు, అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా లేకపోతే డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నదని తెలిపారు. సగటున ప్రతి మనిషి నిత్యం రెండు వందల నుంచి మూడు వందల గ్రాముల చెత్తను తయారు చేస్తున్నారని అన్నారు. పరిసరాల పరిశుభ్రతలో శానిటేషన్ సిబ్బంది కష్టం వెలకట్టలేనిదన్నారు. పరిశుభ్రతతో పాటు పచ్చదనం కూడా ఎంతో అవసరమన్నారు. పచ్చదనం కోసం మొక్కలు నాటాల్సిన అవసరం ఉన్నదన్నారు. చెట్లు మనకు ఆక్సిజన్ అందిస్తున్నాయన్నారు. తెలంగాణలో 33 శాతం అడవులు ఉండాల్సిన అవసరం ఉన్నా ప్రస్తుతం 24శాతం మాత్రమే అడవులు ఉన్నాయని పేర్కొన్నారు.

### మున్సిపాలిటీలో ప్రత్యేక కార్యాచరణ..

మున్సిపాలిటీ పరిధిలో పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి తెలిపారు. ప్రతివార్డులోనూ పరిసరాల పరిశుభ్రతతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ సునీత, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, కౌన్సిలర్లు శ్వేత, ఆకుల మమత, ఆకుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



'స్వచ్ఛదనం-పచ్చదనం' ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శశాంక, తదితరులు

# రూ.60 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

వికారాబాద్, ఆగస్టు 5 : వికారాబాద్ నియోజకవర్గంలో సోమవారం రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రూ.60 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి నుంచి రాళ్లచిట్టంపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు రూ.12 కోట్లు, వికారాబాద్ పట్టణ కేంద్రంలో 4 సూటెడ్ ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.6 కోట్లు అదేవిధంగా మర్పల్లి నుంచి కోట్‌పల్లి వరకు వివిధ అనుసంధాన రోడ్ల నిర్మాణానికి రూ.42 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా జిల్లా పర్యటనకు వచ్చిన శాసనసభాపతికి, మంత్రికి కలెక్టర్ ప్రతీక్ జైన్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సభాపతి, మంత్రి పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, ఇంజినీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్, ఎస్ఈ వసంత నాయక్ , ఇన్‌చార్జి ఈఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేశ్, వైస్ చైర్మన్ శంషాద్ బేగం, ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.